సాక్షి చిత్తూరు

గురువారం । 21 । మార్చి । 2024



పంటలపై ఏనుగుల దాడులు

సోమల మండలంలోని గురికానివారిపల్లెలో ఏనుగుల గుంపు తోటలపై పడి నాశనం చేసింది.

- 8లో



అనుమతులు లేకుండా ప్రచారం వద్దు

రాజకీయ పార్టీల ప్రతినిధులు అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం చేయకూడదని ఆర్‌ఓ శ్రీనివాసులు సూచించారు

- 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం (ఉ)
చిత్తూరు	6.29	4.56
పుంగనూరు	6.31	5.00

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్ల పరిశీలన



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను వివరిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు పరిశీలించారు. బుధవారం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కౌంటింగ్ కేంద్రంలో అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పూతలపట్టు ఆర్‌ఓ, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

చిత్తూరు కలెక్టరేట్ : స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు చేపట్టాలని నోడల్ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ డీఐఓ డాక్టర్ రవిరాజు అన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలుపై చిత్తూరు డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో నమోదు చేసుకున్న ఆస్పత్రి, ల్యాబ్, క్లినిక్‌లు మాత్రమే ప్రాక్టీస్ నిర్వహించాలన్నారు. అలాకాకుండా ప్రాక్టీస్ చేసినట్‌లైతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్‌లైతే చట్టం ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమాన విధించడం జరుగుతుందన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద హుండీలను లెక్కించారు. మొత్తం 37 రోజులకు గాను హుండీ ద్వారా స్వామి, అమ్మవార్లకు కానుకల రూపంలో రూ.2,10,62,681 వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. అలాగే 128 గ్రాముల బంగారం, 592.350 కిలోల వెండి సమకూరినట్లు వివరించారు.

ఎస్వీ జూలో పిచ్చుకల దినోత్సవం



పిచ్చుకల బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతుప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు పర్యావరణంలో పిచ్చుకల ప్రాధాన్యత, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు పిచ్చుకల బొమ్మలను చిత్రించారు. ప్రతిభ కనబరచిన పిల్లలను సీసీఎఫ్ నాగభూషణం, జూ క్యూరేటర్ సెల్వం, సైన్స్ సెంటర్ ఎడ్యుకేషన్ అధికారి అభినందించారు.

శ్రీవారి దర్శనానికి 9 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాం ప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,251 మంది స్వామివారిని దర్శించుకోగా, 20,989 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 9 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అభివృద్ధికి మారుపేరు.. పుత్తూరు..

దేశంలోనే పుత్తూరు పట్టణానిది ప్రత్యేక స్థానం. ఐదు దశాబ్దాల పాటు నియోజకవర్గ కేంద్రంగా ఉన్న పుత్తూరు స్వాతంత్ర్య సమరయోధులు, సంస్థానాధీశులు, కమ్యూనిస్టులు, న్యాయవాదులు, అధ్యాపకులను శాసనసభకు పంపిన ఘనకీర్తి. కానీ అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలోనే ఉండిపోయింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పుత్తూరు రూపురేఖలు మారిపోయాయి. అడుగడుగునా అభివృద్ధికి మారుపేరు పుత్తూరు అనేలా మారింది.



పుత్తూరు పట్టణం



అర్బన్ హెల్త్ సెంటర్

జరుగుతున్న ప్రధాన అభివృద్ధి పనులు	రూ.కోట్లలో
ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ (ఏఐఐబీ) ద్వారా బ్యాంకు శాశ్వత మంచినీటి పథకం	139
నాడు–నేడు రెండో విడత పనులు (50)	14.94
ఎస్‌ఎస్ ట్యాంకుకు శాశ్వత మరమ్మతులు	9
డీఎస్పీ కార్యాలయం	1 కోటి
శ్రీసదాశివేశ్వరస్వామి పుష్కరిణి	30 లక్షలు
మొత్తం	164.24

పుత్తూరు మున్సిపాలిటీ సమాచారం



అధికార పక్షం **వైఎస్సార్‌సీపీ**

వార్డులు	వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు
27	22 మంది
టీడీపీ కౌన్సిలర్లు	**కోఆప్షన్ మెంబర్లు**
5	3

- ప్రగతి పథంలో పయనిస్తున్న పుత్తూరు
- ఐదు దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడదూరంలోనే నిలిచిన వైనం
- ఈ ప్రభుత్వం వచ్చాక మారిన రూపురేఖలు
- ప్రజలకు డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.కోట్లలో సంక్షేమ, అభివృద్ధి ఫలాలు



షాదీ మహల్

పుత్తూరు: 1962 నుంచి నియోజకవర్గ కేంద్రంగా ఉన్న పుత్తూరు 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో నగరిలో విలీనమైంది. తొలి నుంచి మేజర్ పంచాయతీగా ఉన్న పుత్తూరును 2005 జూన్ 24న మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. పేరుకు మున్సిపాలిటీగా మారినా అప్పటి నుంచి పదిహేనేళ్ల పాటు పెద్దగా ఒరిగిందేమీ లేదు. 2019లో రాష్ట్రంలో ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధి పనులు పరుగులు పెట్టాయి. అలాగే 2020లో పుత్తూరు మున్సిపాలిటీని సైతం ఈ ప్రభుత్వం చేజిక్కించుకుంది. అప్పటినుంచి పుత్తూరు మున్సిపాలిటీ రూపురేఖలు మారుతూ వచ్చాయి. మంజూరైన నిధులే అందుకు సాక్ష్యం.

మున్సిపాలిటీకి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు

	గ్రాంటు రూ.కోట్లల్లో	నిధుల ఖర్చు రూ.కోట్లల్లో
ఏఐఐబీ	139.00	50.00
14వ ఆర్థిక సంఘ నిధులు	4.20	4.20
15వ ఆర్థిక సంఘ నిధులు	10.50	3.20
జనరల్ ఫండ్స్	4.20	1.80
ఎంపీ ల్యాడ్స్	0.50	0.50
మున్సిపల్ బిల్డింగ్(స్పెషల్)	2.72	1.97
అర్బన్ హెల్త్ సెంటర్లు	1.60	1.45
జీజీఎంపీ	2.00	1.00
అమృత్ వాటర్ సప్లై	12.90	0.00
మొత్తం	177.62	64.12

పుత్తూరులో జరిగిన అభివృద్ధి పనులు
మురుగు కాల్వల నిర్మాణాలు 8.2 కిలోమీటర్లు వ్యయం రూ.2.05 కోట్లు
సీసీ రోడ్లు 7.8 కిలో మీటర్లు వ్యయం రూ.5.33 కోట్లు
పైపులైన్లు 7.5 కిలో మీటర్లు రూ.60 లక్షలు
నూతనంగా వేసిన బోర్లు 8 వ్యయం రూ.24 లక్షలు

పుత్తూరులో జరిగిన శాశ్వత అభివృద్ధి పనులు	రూ. కోట్లలో
పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల	7.60
నాడు-నేడు ఫస్ట్ ఫేజ్	4.61
షాదీమహల్	2.41
మున్సిపల్ పరిపాలన భవనం	1.97
గ్యాస్ శ్మశాన వాటిక	1.60
రెండు అర్బన్ హెల్త్‌సెంటర్లు	1.60
వైఎస్సార్ మున్సిపల్ పార్క్	1.10
గేట్‌పుత్తూరులో జగనన్న సమావేశ మందిరం	0.43
ఆరేటమ్మ ఆలయ ఆర్చీ, వివిధ అభివృద్ధి పనులు	0.38
శ్రీద్రౌపదీదేవి ఆలయ రాజగోపురం	0.25
మొత్తం	21.95

గత ఐదేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	నగదు రూ.కోట్లలో	పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	నగదు రూ.కోట్లలో
వైఎస్సార్ పెన్షన్ కానుక	5,928	22.68	అమ్మఒడి	5,274	31.64
వైఎస్సార్ చేయూత	2,294	17.21	జగనన్న విద్యా దీవెన	1,266	7.60
కాపునేస్తం	179	1.07	జగనన్న వసతి దీవెన	1.266	7.60
నేతన్న నేస్తం	24	0.23	ఈబీసీ నేస్తం	261	1.57
వైఎస్సార్ చేదోడు	213	0.85	వైఎస్సార్ ఆసరా సంఘాలు	761	28.48
వాహన మిత్ర	147	0.59	వైఎస్సార్ సున్నావడ్డీ సంఘాలు	999	15.16
వైఎస్సార్ తోడు	1,288	5.15	జగనన్న పేదలందరికీ ఇళ్లు	406	5.14
			జగనన్న హౌసింగ్ లేఅవుట్	781	6.16



ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల

ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా చేకూరిన లబ్ధి :151.13

పరోక్ష ప్రయోజనాల ద్వారా చేకూరిన లబ్ధి : 53.90

ప్రత్యక్షంగా, పరోక్షంగా అందిన మొత్తం : 205.03

వైఎస్సార్‌సీపీ రుణం తీర్చుకుంటాం

- పార్టీలో చేరిన జంబాడ టీడీపీ నేతలు, కార్యకర్తలు
- మేమంతా రోజమ్మ వెంటే ఉంటామని స్పష్టం



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన జంబాడ గ్రామస్తులు

విజయపురం : 'మేమంతా మంత్రి రోజా వెంటే ఉంటాం.. ఎందుకంటే మా జంబాడ గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు.. అందుకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు వేసి రుణం తీర్చుకోవాలనే లక్ష్యంతో టీడీపీని విడిచి మంత్రి రోజా సమక్షంలో పార్టీలో చేరుతున్నాం' అని అని జంబాడ ఆదిఆంధ్రవాడ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. బుధవారం మంత్రి ఆర్‌కే రోజా సమక్షంలో వారు నగరిలోని మంత్రి నివాసంలో జంబాడకు చెందిన టీడీపీ నాయకులు బాలాజీ, సుబ్బరాయుడు తమ అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి ఆర్‌కే రోజా నాగయ్య, నాగార్జున, శ్రీధర్, కుమార్, వెంకటేష్, ప్రియా, నందిని, బుజ్జమ్మతో పాటు 25 కుటుంబ సభ్యులకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ 40 ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలను మంత్రి ఆర్‌కే రోజా ఈ నాలుగేళ్లలో తీర్చారని, అందులో ప్రధానంగా రూ.85 లక్షలతో జంబాడ-కనకమ్మసత్రానికి తారురోడ్డు, నాడు-నేడు కింద జంబాడ హైస్కూల్‌లో రూ.73 లక్షలతో తరగతి గదులు, ప్రాథమిక పాఠశాలకు రూ.20 లక్షలతో అభివృద్ధి చేయడంతో పాటు రూ.25 లక్షల వ్యయంతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేశారని తెలిపారు. కార్యక్రమంలో జంబాడ సర్పంచ్ భాస్కర్ రాజు, శ్రీరాములు గోవిందు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ వర్క్ పేరుతో ప్రచారం



విద్యార్థులను తీసుకొచ్చిన నారాయణ కాలేజి బస్సు

చిల్లకూరు : ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మభ్య పెట్టేందుకు టీడీపీ నేతలు వివిధ పన్నాగాలు పన్నుతున్నారు. ఈ క్రమంలోనే బుధవారం గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో ఇంటింటి ప్రచారం చేపట్టేందుకు విఫలయత్నం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. చదువుకునే పిల్లలకు సంక్షేమ పథకాలతో పనేంటని గ్రామస్తులు ప్రశ్నించడంతో వారు నీళ్లు నమిలారు. తమకు ప్రాజెక్ట్ వర్క్ ఇచ్చారని, అందులో భాగంగానే ఈ వివరాలు అడిగామని బుకాయించారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇలా ప్రాజెక్ట్ వర్క్ పేరుతో ప్రచారం చేయడం సరికాదని స్పష్టం చేశారు. మళ్లీ ఇలాంటి కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో వచ్చిన బస్సులోనే విద్యార్థులు, అధ్యాపకులు తిరుగుప్రయాణమయ్యారు. నారాయణ విద్యాసంస్థల అధినేత నెల్లూరులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున ఆయన ఆదేశాల మేరకే ఎక్కడెక్కడ నారాయణ కాలేజీలు ఉన్నాయో అక్కడ విద్యార్థులతో పార్టీ అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేయిస్తున్నట్లు తెలిసింది. ఫీజుల కింద రూ.లక్షలు చెల్లిస్తే తమ పిల్లలతో ఇలాంటి పనులు చేయించడంపై తల్లిదండ్రులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకుండా మాజీమంత్రి ఎన్నికల ప్రచారం


- అభ్యంతరం తెలిపిన అధికారులు
- గతంలో ప్రచారానికి పర్మిషన్ లేదే అని మాజీమంత్రి అమరనాథరెడ్డి ఎదురుప్రశ్న
- తప్పకుండా అనుమతి ఉండాల్సిందేనన్న ఆర్డీఓ



అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి అమరనాథ రెడ్డిని ప్రశ్నిస్తున్న అధికారులు

పలమనేరు/బైరెడ్డిపల్లి: పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం బేలుపల్లిలో మాజీమంత్రి అమరనాథ రెడ్డి బుధవారం ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు పలమనేరు ఆర్డీఓ మనోజ్ రెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన ఆదేశాల మేరకు బైరెడ్డిపల్లి ఎంపీడీఓ రాజేష్, పంచాయతీ కార్యదర్శి బాలాజీ అక్కడికి చేరుకుని అనుమతులను అడిగారు. ప్రచార రథానికి, మైక్‌కు పర్మిషన్ ఉండాలని సూచించారు. తాము దరఖాస్తు చేసుకున్నామని, వాళ్లు ఇంకా ఇవ్వలేదని మాజీమంత్రి సమాధానం ఇచ్చారు. అయితే ప్రచారాన్ని ఆపేయాలని సూచించారు. దీంతో ఆయన మీ ఆర్డీఓకు కాల్ చేయండి నేనే మాట్లాడుతా అంటూ ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఎన్నికల కమిషన్ ఆదేశాలను తుచ తప్పకుండా పాటించాల్సిందేనని ఆర్డీఓ తెలిపారు. దీంతో మీకు వాట్సాప్ ద్వారా పంపుతానని చెప్పడంతో అనుమతులు వచ్చాకే ప్రచారాలు చేసుకోవాలని అక్కడున్న అధికారులు తెలిపారు. కానీ ఆయన పార్టీ నాయకులతో కలసి కొంతసేపు మళ్లీ ప్రచారం చేసి ఆపై అక్కడి నుంచి తిరుగుముఖం పట్టారు. కోడ్ ఆఫ్ కండక్ట్ గురించి తెలిసిన మాజీ మంత్రే అనుమతులు లేకుండా ప్రచారం చేయడం గమనార్హం.





తిరుమల శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు బుధవారం టీటీడీ అంగరంగ వైభవంగా శ్రీకారం చుట్టింది.. సీతా లక్ష్మణ సమేత నీలమేఘశ్యాముని దివ్యతేజస్సుని దర్శించి భక్తకోటి పులకించింది. – తిరుమల

క్లుప్తంగా

పంగుణోత్తర ఉత్సవాల్లో అపశృతి


గోపీకృష్ణ (ఫైల్)

నగరి : మున్సిపల్ పరిధిలోని సత్రవాడ చిదంబరేశ్వర ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అధికార నందివాహన సేవలో అదుపుతప్పి వాహనం పైన పడడంతో సేవలో పాల్గొన్న గోపీకృష్ణ (18) అనే విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. చిదంబరేశ్వర ఆలయంలో నిర్వహించే పంగుణోత్తర కల్యాణోత్సవంలో 5వ రోజైన అధికార నంది వాహన సేవలో వాహనం అదుపు తప్పడంతో దాని కిందపడిన గోపీకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అందించి తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం అతను మృతిచెందాడు. కాగా గోపీకృష్ణ ఇటీవలే ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. ఇతని మృతితో స్థానికంగా విషాద చాయలు అలుము కున్నాయి. దీంతో ఆలయంలో ఉత్సవాలను కూడా ఆపివేశారు.

పీఎం సూర్యఘర్.. ఇంట్లోనే పవర్

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం ప్రస్తుతం ఎన్నో సరికొత్త విధానాలను అమల్లోకి తెస్తోంది. ఇప్పటికే ఈ బైక్, కార్లను ప్రోత్సహించింది. ఇప్పుడు సోలార్ విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తోంది. వీటికి సబ్సిడీ, రుణ సదుపాయం కల్పించింది. ఆసక్తిదారులు మొబైల్‌లో పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌరవిద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 1100 మంది వీటి కోసం దరఖాస్తు చేసుకున్నారు.

- సోలార్ ప్యానల్‌తో పీఎం సూర్యఘర్ యాప్‌లో నమోదు
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 1,100 మంది నమోదు
- నెట్‌మీటర్‌తో విద్యుత్ ఉత్పత్తి, వాడకం తెలుసుకునే అవకాశం
- 30 రోజుల్లో సబ్సిడీ జమ
- కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్‌తో నెలకు దాదాపు 125 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

చిత్తూరు కార్పొరేషన్: మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం ద్వారా లబ్ధి చేకూరుతోంది. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కొత్త పథకం

వినియోగం	సోలార్ రాయితీ కెపాసిటీ (కిలోవాట్లు)	యూనిట్లు (రూ.వేలు)
0–150	1–2	30–60
150–300	2–3	60–78
300 లోపు	3	78

సరికొత్త అధ్యాయానికి నాంది పలికినట్లు అవుతోంది. ఇందుకు గాను పీఎం సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలను పూరించాలి. ఆరు నెలలుగా కరెంటు బిల్లు కాపీని అందులో పెట్టి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దరఖాస్తుదారుడు నెలసరి విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు మాత్రమే ఉండాలి. తదుపరి ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలోవాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు.

ప్రయోజనాలు..

నెట్‌మీటర్ అమర్చిన తర్వాత వినియోగదారుడు పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ 30 రోజుల్లో చెల్లించనున్నారు. ఒక కిలోవాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ కోసం 3–4 ప్యానెల్స్ 1 మీటర్ వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తు కొలతలతో అమర్చనున్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్ నెలకు దాదాపు 125 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. వినియోగదారుడు డిస్కమ్ నుంచి కనీస విద్యుత్ బిల్లులను పొందుతారు. సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్లు సూర్యుని వేడిని పీల్చుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వినియోగదారుడు ఆరేళ్లలోపు పెట్టిన పెట్టుబడిని తిరిగి పొందుతారని చెబుతున్నారు.

తదుపరి ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు.


సోలార్ ప్యానల్స్

సోలార్ విధానం ఉపయోగం..



వినియోగదారులు సోలార్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవడం మంచి పథకం. వీటిని సులభతరంగా చేయడానికి ప్రభుత్వం రాయితీ, రుణ సదుపాయం కల్పిస్తోంది. 6 ఏళ్లలో పెట్టిన పెట్టుబడిని తిరిగి పొందవచ్చు. నెట్‌మీటర్ విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి, వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే కరెంట్‌బిల్లులో ఉండే సంబంధిత ఏఈల నంబర్లను సంప్రదించాలి.

– కృష్ణారెడ్డి, ఎస్ఈ, ట్రాన్స్‌కో

ప్రస్తుతం వాడుతున్న మీటర్‌ను తొలగించి వాటి స్థానంలో నెట్‌మీటర్‌ను పెడతారు. దీని ద్వారా సోలార్ ద్వారా వస్తున్న ఉత్పత్తి, వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ను బేరీజు చేస్తారు.

పంటలపై ఏనుగుల దాడులు


సోమల : ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపైరు

పుంగనూరు: అర్ధరాత్రి ఏనుగుల గుంపు పంటలపై పడి ధ్వంసం చేసిన సంఘటన మంగళవారం రాత్రి సోమల మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గురికానివారిపల్లెకు చెందిన మహేశ్వర్, గుర్రప్పకు చెందిన మామిడి, టెంకాయ చెట్లు సుమారు 6 ఎకరాలలో ధ్వంసం చేశాయి. అలాగే సదుం మండలం చెరుకువారిపల్లె గ్రామానికి చెందిన అమీర్‌సాహెబ్‌కు చెందిన 2 ఎకరాల వరి పంటలను ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

గోదాములో అగ్ని ప్రమాదం


దగ్ధమవుతున్న గోదాము

శ్రీకాళహస్తి: పట్టణంలోని బైపాస్‌రోడ్డు పక్కన శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ గోదాములో బుధవారం వేకువజామున అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు గుర్తించి గోదాము యజమాని జయరామ్‌కు సమాచారం అందించారు. ఆయన తిరువణ్ణామలైలో ఉండడంతో బంధువులకు విషయం తెలపాడు. వారు అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు యత్నించారు. అయితే గోదాములో థమ్సప్ పరిశ్రమకు చెందిన వ్యర్థాలు, బాటిలింగ్ క్లీనింగ్ ప్లాంటుకు సంబంధించిన ప్లాస్టిక్, ఎస్ఎస్ ఐరన్ వస్తువులకు మంటలు అంటుకోవడంతో అదుపు కాలేదు. పక్కనే ఉన్న ట్రాక్టర్, ట్రాలీ కూడా అగ్నికీలల్లో చిక్కుకుని మొత్తం కాలిబూడిదగా మారాయి. జిల్లా అగ్నిమాపక అధికారి జె.రమణయ్య ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. గోదాము యజమాని జయరామ్‌ను ఫోన్‌లో సంప్రదించగా రూ.1.25 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ మేరకు ఇన్‌వాయిస్‌లను అగ్నిమాపక అధికారులకు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

డేటా సైన్స్ సెంటర్ ప్రారంభం


డేటా సైన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

తిరుపతి సిటీ: స్థానిక తుమ్మలగుంటలోని నలందానగర్‌లో ఏర్పాటుచేసిన డేటా సైన్స్ సెంటర్‌ను బుధవారం విర్చోవ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఎం నారాయణరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లోనూ డేటా సైన్స్ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. డేటా సైన్స్ సెంటర్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించానని తెలిపారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్స్ సంస్థ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి, కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, సెక్రటరీ కే చిన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

ఆగని టీడీపీ నాయకుల అక్రమాలు

- ఒరవ కాలువలను వదలని తెలుగు తమ్ముళ్లు
- యథేచ్ఛగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన వైనం
- రెండు ట్రాక్టర్లు స్వాధీనం


పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

పెనుమూరు(కార్వేటినగరం): టీడీపీ నాయకుల అక్రమ సంపాదనలో ఇసుక మూలధనంగా మారింది. ఎక్కడ కాలువలు, వంకలు కనిపించినా అక్కడ తెలుగు తమ్ముళ్లు రంగంలోకి దిగి యథేచ్ఛగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నకలికిరి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమై ఇసుకతో నింపిన రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకులు అక్రమ సంపాదనే లక్ష్యంగా వంకలు, వాగులే కాకుండా ఒరవ కాలువలను సైతం వదలకుండా ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలించి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా ఇసుక తరలించడమే కాకుండా కొందరు టీడీపీ కార్యకర్తలు, నాయకులు అక్రమ మద్యం అమ్మకాలు చేయడంలో ఆరితేరిపోయారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అక్రమ సంపాదనకు అలవాటు పడిన వారు ఇప్పటికీ అదేబాటను ఎంచుకుని దోచుకుంటున్నారని, అక్రమ సంపాదనలో టీడీపీ నాయకులు చంద్రబాబును మించిపోయారని బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక


ఐనేరి గిరిధర్‌రెడ్డిని పార్టీలో ఆహ్వానిస్తున్న విజయానందరెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎంసీ విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా మాజీ ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ ఐనేరి గిరిధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. సంతపేటలోని కార్పొరేటర్ జ్ఞానజగదీష్ నివాసంలో ఆయనకు ఆ పార్టీ చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. అందరూ ఐక్యంగా ఉండి వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి నాయకులు బాలసుబ్రమణ్యంరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో పలువురి చేరిక

స్థానిక ఎల్‌బీపురానికి చెందిన 11 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి వారికి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రాజేంద్రన్, గిరి ఆచారి, జగన్నాథ ఆచారి, వెంకటేష్ ఆచారి, హరి నాయకర్, పలని, ఏకాంబరం నాయకర్, కృష్ణనాయుడు, ఉమాపతి నాయకర్, రాజగోపాల్ నాయకర్ ఉన్నారు.

గ్రేడ్–3 ఏఎన్‌ఎం సస్పెన్షన్

- టీడీపీ ప్రచారంలో పాల్గొన్న ఏఎన్‌ఎం
- చర్యలు తీసుకున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చౌడేపల్లి–2 సచివాలయంలో విధులు నిర్వహించే గ్రేడ్–3 ఏఎన్‌ఎం లతను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 20న ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు సంబంధిత ఉద్యోగి లత ఎన్నికల కోడ్‌ను పాటించకుండా టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తెలిపారు. పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గం సోమల మండలంలోని ఇరికిపెంటలో టీడీపీ నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నట్లు ఎంసీసీ కమిటీ అధికారులకు ఫిర్యాదు అందగా, ఆ కమిటీ విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఈ మేరకు గ్రేడ్–3 ఏఎన్‌ఎంను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాణసంచా పేలుడు ఘటనలో ఇద్దరి మృతి

సూళ్లూరుపేట : పట్టణంలోని ఏషియన్ హైవే పక్కన బాణసంచా గోదాము వద్ద మంగళవారం సంభవించిన పేలుడు ఘటనలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. ఈ ప్రమాదంలో ఆరుగురు గాయపడగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైలోని కేఎంసీ ఆస్పత్రికి తరలించిన విషయం విదితమే. ఈ క్రమంలో బీహార్‌కు చెందిన రాజ్‌కుమార్ (18), రవి (21) బుధవారం రాత్రి మరణించారు. మరొకరి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించినట్లు ఎస్ఐ రహీమ్‌రెడ్డి తెలిపారు. చెన్నైలోనే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాలను అప్పగించనున్నట్లు వివరించారు.

అనుమతులు లేకుండా ప్రచారాలు చేయకూడదు

- రాజకీయ పార్టీల ప్రతినిధులకు చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు సూచన


పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : ముందస్తు అనుమతులు పొందకుండా రాజకీయ పార్టీల నేతలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రైవేట్ ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యంతో 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార సామగ్రి, ప్రచారాలు ర్యాలీలు సమావేశాలు నిర్వహించుకోవాలన్న అంశంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిపారు. వాహనాలు, లౌడు స్పీకర్లు, ర్యాలీలు సమావేశాలు ఇంటింటికి ప్రచారానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గాల ఆర్‌ఓల నుంచి 24 గంటల ముందుగా అనుమతి పొందాలన్నారు. నేరుగా ఆర్‌ఓకు, సువిధా యాప్‌లో కూడా దరఖాస్తు చేసుకున్న తరువాతే ప్రచారం చేసుకోవచ్చని తెలిపారు. అనుమతులు లేకుండా ప్రచారాలు, ర్యాలీలు నిర్వహిస్తే ఎన్నికల కోడ్ నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల ప్రచార సామగ్రికి సంబంధించి ముందుగానే కలెక్టరేట్ స్పందన హాల్‌లో ఉన్న ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఆ తర్వాతే ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్‌లు చేయించుకోవాలని తెలిపారు. ఎన్ని కాపీలు, ఎన్ని పోస్టర్లు, ఫ్లెక్సీలు, వాటి సైజు వంటి పూర్తి వివరాలు, సంబంధిత ప్రింటింగ్ ప్రెస్ పేరు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇప్పటి నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకు చేసే ఖర్చులను ఆయా పార్టీలకు జమ చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు నామినేషన్లు వేసినప్పటి నుంచి పోటీలో ఉన్న అభ్యర్థికి ఖర్చులు జమ చేస్తామన్నారు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీలకు సంబంధించి 5 అనుమతులు ఇచ్చామని తెలిపారు. సమావేశంలో చిత్తూరు అసెంబ్లీ ఏఆర్‌ఓ అరుణ, డీపీఆర్‌ఓ పద్మజ, డీపీఓ లక్ష్మీ, ఏఈఆర్‌ఓలు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పిచ్చాటూరు : మండలంలోని కీళపూడి కోళ్లఫారమ్ వద్ద బుధవారం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. వివరాలు.. విశ్రాంత ఆర్మీ జవాన్ తంగవేల్ రెడ్డి(55) పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో నివసిస్తున్నారు. రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై పుత్తూరుకు బయలుదేరారు. మార్గం మధ్యలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రూ.5 లక్షల నగదు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

పులిచెర్ల(కల్లూరు): ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. వివరాలు..బుధవారం రాత్రి కల్లూరులో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా సోమల నుంచి తిరుపతికి వెళ్లే ఒక ప్రైవేటు వాహనాన్ని తనిఖీ చేశామన్నారు. అందులో సోమలకు చెందిన సన్వరిలాల్(32)ఎటువంటి రికార్డులు లేకుండా రూ.5 లక్షలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి ఆ సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- యువకుడి మృతి, మరో ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి రూరల్ : స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో ఉల్లాసంగా....ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆత్మీయుల మధ్య ఆటపాటలతో సందడి చేశారు...ఎన్నో జ్ఞాపకాలను వెంటేసుకుని వెనుదిరిగారు. అసలే జాతీయ రహదారి..అర్ధరాత్రి ...ఆపై అతివేగంతో కారు దూసుకెళుతోంది. కంటి మీదకు చిన్న కునుకు రావడంతో కారు అదుపు తప్పింది. డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన మంగళవారం రాత్రి తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేంద్రబాబు కథనం మేరకు..తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురానికి చెందిన తమ్మినేని నాగిరెడ్డి(19) బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నాడు. తన మిత్రుడు ప్రీతమ్ పుట్టిన రోజు కావడంతో మంగళవారం రాత్రి తన స్నేహితులు నాగిరెడ్డి, మనోజ్, బద్రీతో కలిసి తన కారులో చంద్రగిరి మండలం ఐతేపల్లె సమీపంలోని దాబాకు డిన్నర్ చేసేందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రామానుజపల్లె చెక్‌పోస్ట్ దాటిన తర్వాత ప్రీతమ్ డ్రైవింగ్ చేస్తున్న అతివేగం కారణంగా డివైడర్‌ను ఢీకొంది. దీంతో నాగిరెడ్డి తలకు తీవ్రమైన గాయం కావడంతో మరణించాడు. ప్రీతం, మనోజ్, బద్రీని స్థానికులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు తేజారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.